పెద్దకథ

# శారద నిర్ణయం

'అన్నపూర్ణ'

ప్రతి ఆదివారంలానే ఆ సాయంత్రమూ నాలుగు గంటలయ్యే సరికి కళ్యాణి వాళ్ళ ఇంటికి వచ్చాడు హేమంత్....ప్రతివారం ఆవేళప్పుడు శారద అక్కడికి వస్తుంది.....అంతాకలిసి కాసేపు సంతోషంగా కబుర్లాడుకొని - అవకాశాన్ని బట్టి ఏ మొదటి ఆట సినిమాకో వెళ్ళటం రివాజు. ఆవేళా ఆశతో వచ్చాడు హేమంత్ అక్కడికి.

"శారదరాలేదా కళ్యాణి ?"—లోపల అడుగుపెట్టిన అతడికి ముందు గదిలో—ఒక్క కళ్యాణే కనిపించటంతో అనుమానం వచ్చి అడిగాడు.

కానీ, కళ్యాణి ఎప్పటిలా జోక్ చేస్తూ సమాధానం చెప్పలేదు. గంభీరంగా ముఖం పెట్టుకొని కూర్చొని ఉంది.

"ఏమిటి కళ్యాణీ అలా ఉన్నావ్ ?.... ఏమైంది?.... శారద రాలేదా? - మనసు పెట్టే తొందర కొద్దీ మరోసారి అడిగాడు.

"లేదు.... ఇకముందు కూడా అది మన ఇంటికి రాదు"— అంటూ కూర్చున్న చోటునుంచి దిగ్గున లేచింది కళ్యాణి.

"....ఏమిటి.... కళ్యాణీ !.... కొత్త కొత్తగా మాట్లాడుతున్నావేం?"— ఖంగుతిని అన్నాడు హేమంత్.

"అవునన్నయ్యా.... శారదకు నిజమేమిటో తెలిసిపోయింది ! ఇప్పుడు దానికి నామీద పూర్తిగా నమ్మకం పోయింది...." చెప్పదలుచుకున్న మాట చెప్పేసింది కళ్యాణి. బ్రాన్పడిపోయాడు హేమంత్.

"ఏదైతే జరగకూడదని ఇంతకాలం జాగ్రత్త పడ్డామో అదే జరిగిపోయిందన్న మాట.... కళ్యాణీ! నాకు తెలుసు. దీనికంతటికీ కారకుడు వాడు - ఆ ప్రసాదే వాణ్ణి—" అటూ ఆవేశపడి పళ్ళు కొరికాడు.

హేమంత్ జరిగిపోయిందానికంతటికీ ప్రసాద్‌ను కారణభూతుణ్ణి చేసి మాట్లాడటంతో ఖంగారుపడింది కళ్యాణి...." తన మనసుకు నచ్చినట్లు చేస్తోంది. ఇలాగైనా చేసి పాపాన్ని కడిగేసుకోవాలనుకుంటోంది....తప్పితే ఇందులో ప్రసాద్ పాత్ర లేనేలేదు.... ఈ విషయం అన్నయ్యకు తెలయచెప్పటం ఎలా?" అన్న సందిగ్ధంలో పడింది ఆమె.

"ప్రసాద్ ఎంతో సంస్కారంఉన్నవ్యక్తి అన్నయ్యా...అతడు నిన్ను ఎటువంటి సందర్భంలోనూ అగౌరవపరచాలని చూడటం లేదు." అంది పై మాటగా.

"నీకు తెలియదు కళ్యాణీ వాడి సంగతి....పోనీ, వాడే అంత సంస్కారమున్న వ్యక్తి ఆయితే ఈ నిజాన్ని బయటపెట్టి నన్ను కించ పరచాలని చూసేద మరెవరు?" అడిగాడు సూటిగా.

కొద్దిసేపు ఆలోచించింది కళ్యాణి.

"నిన్ను కించపరచాలన్న తలంపు నాకు లేదు.... అయితే అసలు నిజాన్ని శారదకు తెలియ చెప్పింది మాత్రం నేనే !" అనేసింది టక్కున.

"కళ్యాణీ!? – దెబ్బతిన్న బెబ్బులిలా మారాడు హేమంత్.

"ఔనన్నయ్యా. శారద ప్రాణ స్నేహితురాలు...నన్ను నమ్మి తన నిండు జీవితాన్ని నా చేతిలో పెట్టింది.... ఏవో ప్రలోభాలకు లోనై నేనే దాని జీవితంతో ఆడుకుందామని చూశాను.... అయితే నిప్పులాంటిది నిజం.... అది ఏదోఒకనాడు బయట పడక తప్పదు.... అప్పుడు శారద దృష్టిలో నేనొక వంచకురాలిగా మిగిలిపోతాను.... చేతులు కాలకముందే జాగ్రత్త పడటం మేలనిపించింది....నా స్నేహితురాల్ని మోసం చేసి - దాని బ్రతుకును పెద్ద సందిగ్ధంలో పడవేయకూడదనే ఇలాచేశాను.... నా ప్రవర్త నిన్ను ఎంత నిరాశపరచేది,

ఆవేశపరిచేదీ తెలుసు. నా మీద అభిమానము, విశ్వాసము అన్నీ నీలో తుడిచి పెట్టుకు పోతాయనీ తెలుసు.... జీవితంలో తిరిగి నా ముఖం చూడటానికి నీకు మనస్కరించక పోవచ్చును కూడా...."- కళ్యాణి మాటలను పూర్తికానీయలేదు హేమంత్.

"....అన్నీ ఊహించుకొనే, తెలిసే.... చేశావన్నమాట.? కన్న తల్లిమాట కాదని వచ్చి, మీరే నా వాళ్ళని నమ్మి, మీ కష్టసుఖాలే నావిగా భావించి-అన్నివిధాల సహాయపడిన నా కంటే - నీ స్నేహితురాలే ఎక్కువైందన్నమాట.... అవున్లే.... నీకు ఉద్యోగం వచ్చింది. మీరిప్పుడు కష్టాలనుంచి గట్టెక్కి పోయారు....ఇక నా అవసరమేమిటి?...." అలా అంటున్నప్పుడు అతడి కంఠం వణికిపోయింది.

"అంతంత మాటలు అనకు అన్నయ్యా.... నాకు ఉద్యోగం వచ్చి, మేమిప్పుడు రెండుపూటలా కడుపునిండా తింటున్నామంటే - అదంతా నీ చలవే... అవసరాల్ని డబ్బుతో కొలవాలని మాకు లేదు. ఒకవేళ ఇబ్బందుల్లో ఉన్న మమ్మల్ని ఆదుకోకపోయినా - నిన్ను మా పెద్దమ్మ కొడుకుగా-అన్నయ్యగా అభిమానించేదాన్నేనన్నయ్యా." అంది కళ్యాణి నిండు మనసుతో.

"మరి కళ్యాణీ, పెద్దలు - పెళ్ళి మాటల వరకు ఎందుకు రానిచ్చావ్ ఈ వ్యవహారాన్ని?. మొదట్లోనే నిజం చెప్పెయ్యక పోయావా?" అంటూ అచైతన్యంగా ఓ కుర్చీలో కూలబడిపోయాడు హేమంత్.

"అదేనన్నయ్యా నేను చేసిన పొరబాటు.... ఏదైనా వివాహానికి ముందే దానికి అసలు విషయం చెప్పేస్తే - నా తప్పును సరిదిద్దుకున్నట్లవుతుంది, తర్వాత ఏ పేచీకూడా రాదన్న ఉద్దేశ్యంతోనే నిన్న వెళ్ళినప్పుడు శారదకు అసలు విషయం చెప్పేశాను.... ఒకవైపు నీగతాన్ని వివరిస్తూ - నీ నిర్ణయాన్ని సమర్థిస్తూనే మాట్లాడాను. పైగా మీ మామగారైన రామచంద్రరావుగారు ఇచ్చిన హామీ గురించి కూడా చెప్పాను ... అయినా వినలేదు శారద. నిజం తెలిసిన మరుక్షణమే అగ్గిమీద గుగ్గిలమైంది.... తర్వాత నేను చెప్పే ఒక్కమాట కూడా వినిపించుకోలేదు అది. 'ప్రాణాధికంగా నమ్మిన స్నేహితురాల్ని నాకే ద్రోహం చేయతలపెడతావా?.... జీవితంలో తిరిగి నీ ముఖం నాకు చూపించకు.... ఇక మీ అన్నయ్యకు, నాకు ఏమాత్రం పొసగదని చెప్పు. ఫో' అంటూ నన్ను కసిరికొట్టి బలవంతాన బయటికి గెంటినంత పనిచేసింది.... ఇప్పుడు చెప్పు అన్నయ్యా నేను చేసిననేరం? అన్నయ్యవన్న అభిమానంతో ఉండబట్టేకద చివరి క్షణం వరకు నీ మాటకోసం పాకులాడింది?" అంటూ యుక్తిగా తనకి తాను సమర్థించుకొంది కళ్యాణి.

చెల్లెలి మాటలు విని మౌనంగా ఊరుకుండి పోయాడు హేమంత్.... ఆమె చెప్పిందంతా - అక్షరాలా నిజంగానే తోస్తోంది మరి అతడికి.

"నువ్వు హైదరాబాద్ వెళ్ళి రజని విషయం తేల్చుకు రావటం మంచిదేమో హేమంత్?" - లోపల్నించి వచ్చిన శ్రీలక్ష్మి సలహా ఇచ్చింది.

"నేను అక్కడికి వెళ్ళటం అసంభవం పిన్నీ... కాకపోతే జీవితాంతం ఇలాగే - ఒంటరిగానే ఉండిపోతాను"

- "ఆ దృఢ నిర్ణయం, అతడి దిగాలు పడిన వాలకం చూశాక ఆ తల్లీ కూతుళ్ళకు ఎంతో జాలి అనిపించింది.

"ఏమిటే కళ్యాణీ, శారదకేమో వాళ్ళయింటికి వెళ్ళి అలా చెప్పొచ్చావ్. ఇక్కడ హేమంత్‌తోనేమో ఇలా మాట్లాడావ్?...నిజం బయటపడితే వాళ్ళిద్దరూ నిన్ను ఎలా అర్థం చేసుకుంటారో తెలుసా? హేమంత్ వెళ్ళిన తర్వాత కూతుర్ని గట్టిగా మందలించింది శ్రీలక్ష్మి.

"ఎవరెలా అర్థంచేసుకున్నా పరవాలేదమ్మా.... అంత్యనిష్ఠూరం కంటే ఆదినిష్ఠూరమే మంచిదనిపించింది... అయినా ఈ నిజం బయట పడే అవకాశంలేదు.... అన్నయ్య ధైర్యంచేసి శారద వాళ్ళ ఇంటికి వెళ్ళలేడు....అభిమానం చంపుకొని శారద మన ఇంటికి వచ్చే అవకాశమూ లేదు.... నా ప్రమేయం లేకుండా వాళ్ళిద్దరూ ఒకరిని ఒకరు కలుసుకోలేరు.... ప్రసాద్‌గారి మాటలను బట్టి రజనిలో మార్పు వస్తుందనిపిస్తోంది.... ఒకవేళ ఆమెలో వచ్చినట్టు చెప్పబడుతున్న పరిమార్పు అబద్ధమని ఋజువైననాడు నేనే తిరిగి అన్నయ్యను, శారదను కలుపుతాను" అంటూ కళ్యాణి తల్లికి నచ్చ చెప్పింది.

మర్నాడు కళ్యాణి వాళ్ళఇంటికి వచ్చిన హేమంత్,

"నా మనసేం బావుండలేదు కళ్యాణీ.... కొంత కాలం పాటు దేశం తిరిగి వస్తేనైనా మనశ్శాంతి దొరుకుతుందేమోనని - టూర్ ప్రోగ్రామ్ వేసుకున్నాను. అమ్మ ఒప్పుకొంది. బహుశా రేపు రాత్రికి బయలుదేరవచ్చు" అంటూ విషయం చెప్పుకొచ్చాడు

"మంచిదన్నయ్యా"-అంటూ మా అన్నయ్యకు పూర్తి మనశ్శాంతిని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించింది కళ్యాణీ. "క్షేమంగా వెళ్ళిరా నాయనా" అని దీవించింది శ్రీలక్ష్మి.

## 14

"చి.ల.సౌ. రజనికి బంధుమిత్రుడు ప్రసాద్ ఆశీర్వాదాలతో,

నేనిక్కడ కులాసాగానే ఉన్నాను. స్నేహితులు, పరిచయస్థులు బాగానే దొరికారు. మంచి కాలక్షేపమే అవుతోంది.... నాకు

దొరికిన పరిచయస్థులలో నీ మరదలు కళ్యాణీ ఒకరు.... మీనాన్నగారి ద్వారా కళ్యాణి నీపిన్నత్త గారి కూతురని తెలిసి ఉంటుంది.... వీలు చిక్కినప్పుడల్లా నేను వాళ్ళ ఇంటికి వెళ్ళటం, లేదా కళ్యాణి మా యింటికి రావడం జరుగుతోంది.

అసలు నేను ఈ ఉత్తరం రాయటానికి ప్రేరణ వేరే ఉంది.... అయితే—విషయం నీకు తెలియపరచటమా, మానటమా అన్న సందేహంతోనే నేను రాసిన చాలా ఉత్తరాలు పోస్టు చేయకుండా చించివేశా.... చివరికి కళ్యాణి సలహా ప్రకారం ఈ ఉత్తరాన్ని నీదాకా రానివ్వటానికే నిర్ణయించుకున్నాను.

హేమంత్ కళ్యాణి స్నేహితురాలైన శారదను ప్రేమించాడు. పెళ్ళిదాకా వచ్చింది. .... ఒక మిత్రుడిగా నాకుతెలిసిన సమాచారాన్ని నీకు అందించటంవరకే నా విధిగా భావిస్తున్నాను. దేనిమీద ఏ నిర్ణయం తీసుకొనేది నీ చేతిలో ఉందిక .... నీ మనస్సుకు పట్టిన గ్రహణం ఏనాడో వదిలింది. అది నాకు తెలుసు. అయితే నీ జీవితానికి పట్టిన గ్రహణాన్ని రూపుమాపుకోవటం - అంతా నీచేతిలోనే ఉంది. ఆలోచించుకో రజనీ.... అత్తయ్య, మామయ్యలను అడిగినట్లుచెప్పు. ఉంటానుమరి.

నీ శ్రేయోభిలాషి,
ప్రసాద్."

ఉత్తరాన్ని చదివి ఏమాత్రం చలించలేదు రజని. వైరాగ్యంగా దాన్నిపక్కన పెట్టేసింది

గదిలో ఒంటరిగా కూర్చొని - ఎంత వద్దనుకుంటున్నా మనసు గతం మీదికే మళ్ళుతోంది....

హేమంత్ బావ అంటే తనకు మొదట్నుంచీ చులకన భావమే.... అలాంటి భావం కలగటానికి ముఖ్యకారణాలు రెండు. ఒకటి: అతడి చిలిపిచేష్టలు, రెండు: వరసపెట్టి పరీక్షల్లో ఫెయిలవుతూండడం — అదీకాక వివాహబంధమంటే - తనకప్పుడు అర్థంకాక పోవటం కూడా మరోకారణం కావచ్చు.

వయసువచ్చి వివాహ బంధాన్ని అర్థంచేసుకొనేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే అత్తయ్య,బావ వచ్చారు ... బావ తనమీద ఏమిటో అధికారం చెలాయిస్తూ మాట్లాడటం, అత్తయ్య, ఆ కాస్త ఔపోసనా కార్యక్రమం జరిపించేసి కోడల్ని మాతో పంపించి వెయ్యండి. అని గట్టిగా అడగటంతో—తనలో పౌరుషం పెరిగింది.... చదువుమీద గల ఆసక్తితో అప్పుడు ఎవరి మాటనూ పడనీయ లేదు.... అయినా తనని శాసించటానికి వాళ్ళెవరు ?.... తనమీద ఈహక్కు- అధికారం వాళ్ళకు ఎలా సంక్రమించాయి ? అన్న ఆలోచనలో పడింది తర్వాత...

ఏకోణంనుంచీ చూసినా చట్టప్రకారం ఆలోచించినా చిన్నతనం లోనే హేమంత్ కు, తనకు పెళ్ళిజరిపించటం పెద్దల నేరమే...వాళ్ళుచేసిన పొరపాటుకు తానువ్యక్తి స్వాతంత్ర్యాన్ని ఎందుకు కోల్పోవాలి ?.... ఆశలు, ఆకాంక్షలు చంపుకొని తనమనసును ఎలా శిక్షించుకోవాలి?- విద్యవల్ల పెరిగిన విజ్ఞానం వల్లనైతేనేం, బయటి ప్రపంచంద్వారా సంపాదించిన అనుభవంవల్ల నైతేనేం— అలా తీవ్రంగా ఆలోచించి తెలియని వయసులో జరిగినపెళ్ళి-పెళ్ళిలో లెక్కగాదన్న నిర్ణయానికి వచ్చింది.

అదీగాక తను కాలేజీలో చదువుతోంది. హేమంత్ చదువు మానేసి ఇష్టంవచ్చినట్లు తిరుగుతున్నాడు. ఎంత ఆస్తిపాస్తులున్నా చదువూ ముఖ్యమే మనిషికి.... భర్తఅయినవాడు తనకన్నా విద్యావిషయకంగా తక్కువస్థాయిలో ఉండటాన్ని ఏ స్త్రీ సహిస్తుంది ?.... ఆసక్తిలేక భర్త చదువుమానేస్తే - తన జిజ్ఞాసను చంపుకొని భార్య కూడా చదువుమానేసి అతడి స్థాయిలోనే ఉండి పోవటానికి - ఇదేం సత్యకాలంకాదు కద ?— ఈ కారణం బట్టి కూడా హేమంత్ కు, తనకు పొసగటం అసంభవం, అసంబద్ధం అనుకొంది.

అలా మనసును దృఢ పర్చుకొనే అతడి విషయం పూర్తిగా పట్టించుకోవటం మానేసింది. అయితే కన్నమమకారం; అందుకు సంబంధించిన బాధ్యత కోసం—తనకు తెలియకుండా ఉత్తరాలు రాయించి హేమంత్‌ను ప్రలోభపెట్టాడు నాన్న, ఆ ఉత్తరాలు నిజంగా తనే రాసి ఉంటుందన్నభ్రమతో తనమీద ఆశలుపెంచుకొని మోస పోయాడు అతడు....ఆ రోజు తనుడాబామీద మొరటుగా ప్రవర్తించి తన నిజస్వరూపం చూపించింది... "జీవితంలో తిరిగి అతడు తన ముఖం చూడటానికి ఇష్టపడకూడదు" అనే అలా చేసింది.... ఆ ప్రకారమే నడుచుకోవటం మొదలుపెట్టాడు హేమంత్. కారణం అతడికి ఆత్మాభిమానం ఉంది. మరో మాటలో చెప్పాలంటే అతడు మగవాడు !....ఎన్నో ఆలోచనలున్నా, ఎంత చదివినా ఆడది ఆడదే- ఆమెకున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పరిమితం....తను ఏం ఆలోచించి, ఎవరి మీద మనసు పెట్టుకొని - హేమంత్‌ను తిరస్కరించిందో— ఆ వ్యక్తే తనని నట్టేట ముంచాలని చూశాడు....అప్పుడు తెలిసి వచ్చింది తనకు వివాహం, దాని విలువ...

తన స్నేహితురాలు శార్వాణి పుట్టినరోజు పండుగనాడు - ఏర్పాటు చేయబడ్డ అట్టహాసమైన పార్టీలో ఓ మంచి గాయకుడిగా తెలుసుకొంది రజని, నవీన్‌ను .... ఆ రోజు ఓ మధురమైన పాటపాడి అందరిమెప్పు పొందాడు. మైక్‌ముందు నిలబడి పాడుతున్న అతడిచూపు

తనదాకావచ్చి ఆగిపోవటం గమనించింది. తనవైపు చూస్తూనే దాదాపు ఆ పాటను పూర్తిచేశాడు అతడు....పాట అయిపోయాక అందరితో పాటు తనూ అభినందించింది. ....నవీన్‌నువాళ్ళందరి మాట ఏమో గాని తన అభినందనకు అతడు ఎంతో ఉప్పొంగిపోయినట్లు కనిపించాడు.

"నవీన్ మాకు బంధువే. అన్నయ్యవరసవుతాడు....గ్రాడ్యుయేషన్ అయిపోయింది....మ్యూజిక్‌లో డిప్లొమా తీసుకోబోతున్నాడు ఒక్క సంగీతమే కాదు- ఏ యాక్టివిటీలో తీసుకున్నా మా అన్నయ్య మంచి పర్‌ఫెక్ట్ ! నాటకాల్లో వేషాలు వేస్తాడు, స్టేజీ ఎక్కి ఉపన్యాసాలు దంచుతాడు— కథలూ అవీరాస్తూంటాడు..... ఆచారాలు, గ్రహచారాలూ అంటేనే గిట్టవు....అన్నట్లు మా నవీన్ అన్నయ్య వాళ్ళదీ మీ నారాయణగూడానే....బ్లడ్ బ్యాంకికి దగ్గిరే వాళ్ళ ఇల్లు.... "అంటూ వాళ్ళ అన్నయ్యను ఘనంగా పరిచయంచేసింది శార్వాణి... అలాగే తననీ అతడికి పరిచయం చేసింది. అన్ని సుగుణాలున్న నవీన్‌తో పరిచయమేర్పడటం మహద్భాగ్యంగా భావించుకొంది తను.... అందుకే "ప్రొద్దుబోయిందిగా ?... ఇద్దరం కలిసేవెళ్దాం...నే వచ్చేదాకా ఆగండి." అన్న నవీన్ మాట తీసివేయలేక అతడు చెప్పినట్లే చేసింది.

"....గమనించారో లేదో....ఆ పార్టీకి వచ్చినవాళ్ళలో ఎంతో మంది యువతులు ఉన్నారుగాని మీలా ఎవరూ నన్ను ఆకర్షించలేకపోయారంటే మీరు నమ్ముతారా ?" అన్నాడు నవీన్ ఆటోరిక్షా బయలుదేరిన తర్వాత.

అతడి చొరవకు ముందు విస్తుబోయినట్లుచూచినా తర్వాత సిగ్గు అనిపించింది.

"కళాకారులకు సౌందర్యారాధన ఎక్కువని విన్నానులెండి" అంది తను ధైర్యంచేసి. ఏమనుకున్నాడో మరి మాట్లాడలేదు నవీన్.

అదేమొదలు - అప్పట్నుంచీ తరచూ తనకు కనిపిస్తూండేవాడు నవీన్....మనసు విప్పిమాట్లాడుతూండేవాడు....తనకు వివాహమైందని తెలిసినరోజున - హిందూ వైవాహిక వ్యవస్థను గురించి గంటసేపు మాట్లాడాడు—అతడి-మాటల్లో సతీసహగమనాన్ని రూపుమాపటానికి ప్రయత్నించిన రాజారామమోహనరాయ్ మొదలు, వితంతు వివాహాన్ని ప్రోత్సహించిన వీరేశలింగంపంతులుగారి వరకు చాలామంది వచ్చారు. చివరికి ఈ వివాహ వ్యవస్థ మారాలన్నాడు. స్త్రీనికూడా ఓ పరిపూర్ణ వ్యక్తిగా సంఘం గుర్తించాలన్నాడు.... 'అసలు మీ పెళ్ళిపెళ్ళిలో లెక్కకాదు. మెడలోని ఆ పసుపు తాడుకు మీరు ఇంకా విలువ ఇస్తూనే ఉన్నారంటే నాకు నవ్వు వస్తోంది.' అన్నాడు— ఆ అభిప్రాయాలు పూర్తిగా నచ్చినయ్. తన మనసులోని మాటలనే అతడు పైకి చెబుతున్నాడు అనిపించింది....ఆనాడే తను నవీన్ మీద ఆశలు పెంచుకొంది.

తర్వాత రవీంద్రభారతిలో అతడి కొన్ని ప్రోగ్రామ్‌లకు వెళ్ళింది....కొన్ని సార్లు ఇద్దరూ కలిసి పబ్లిక్ గార్డెన్‌కు వెళ్ళారు... టాంక్ బండ్ మీద చల్లగాలికి కూర్చుని తీయగా కబుర్లాడుకున్నారు...

తనకు, నవీన్‌కు మధ్య ఏర్పడిన చనువును గురించి ప్రసాద్‌కు తెలిసింది. "రజనీ, ఓ స్నేహితుడిగా నీకు సలహాయిస్తున్నాను.... నువ్వు ఓ వివాహితవన్న విషయం మాత్రం మరిచిపోకు ఎప్పుడూ. ఎందుకంటే మన వివాహవ్యవస్థ పురాతనమైనదే అయినా సాంఘికంగా అది ఎంతో ఉత్కృష్టమైనదన్నది నా అభిప్రాయం. .... వ్యక్తికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ముఖ్యమే అయినా అవి కొన్ని పరిమితులకు లోబడి ఉండాలనుకుంటాను నామట్టుకు నేను....నాకు తోచింది చెప్పాను. ఇకనీ జీవితం - నీ యిష్టం" అంటూ సలహాయిచ్చి ఊరుకున్నాడు అతడు.

సంగతి తెలిసి "ఎవరిఖర్మకు ఎవరు బాధ్యులు ?" అంటూ వైరాగ్యధోరణి పుచ్చుకున్నట్లు మాట్లాడాడు తండ్రి రామచంద్రరావు.

"ఎంతకు తెగిస్తున్నావే నువ్వు ! ? .... ఇదుగో నేను చెబుతున్నాను - చివరికి ఎందుకూ కొరగాకుండా పోతుంది నీ బ్రతుకు" అంటూ వ్యధాపూరిత కంఠంతో హెచ్చరించింది తల్లి సీతమ్మ.

-ఎవరెన్ని విధాల చెప్పినా, వ్యాఖ్యానాలు చేసినా పట్టించుకోలేదు తను.... స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి, తన బ్రతుకును తమ ఇష్టం వచ్చినట్లు మలుచుకోవటానికి పెద్దలకు గల హక్కేమిటి ? ఈ ఆవేశంలో నవీన్ చెప్పే ఆశావహమైన మాటలు విని అతడివైపు మొగ్గుచూపింది.

ఓ రోజు—

"ఈ రోజు సాయంత్రం మాయింటికి తప్పకుండా రావాలి రజనీ....మా వాళ్ళకు నిన్ను పరిచయంచేస్తాను....మనం అన్ని విషయాలు తేల్చేసుకోవచ్చు...." అంటూ ఎంతగానో చెప్పాడు నవీన్.

అలాగే - అతడు చెప్పిన వేళకే వాళ్ళ ఇంటికి వెళ్ళింది తను....తన రాకకు ఎంతో సంతోషం వ్యక్తం చేసిన నవీన్ మేడ మీదికి తీసుకువెళ్ళాడు....అతడు తనతో ఏమని చెప్పి వాళ్ళ ఇంటికి రమ్మన్నాడో, తను ఏ సదుద్దేశ్యం పెట్టుకొని అక్కడకు వెళ్ళిందో— అంతా అబద్ధమని కొద్దిసేపటిలోనే తేలిపోయింది.

"సారీ, రజనీ...మా వాళ్ళంతా మధ్యాహ్నం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వరంగల్ వెళ్ళారు....అక్కడ మా బంధువులమ్మాయి పెళ్ళి...." అంటూ సంజాయిషీ యిచ్చాడు - తన అన్వేషణ -చూపులను గమనించి.

"ఎవరూ లేకుండా - మరి నాకు అలా ఎందుకు చెప్పాలి ?"- కోపం వచ్చి అడిగింది తను....

"కావాలనే రజనీ .." అంటూ చనువుగావచ్చి తన చేతిని తీసుకొని ముద్దుపెట్టుకున్నాడు.

అతడి చేష్టలకు నిశ్చేష్టిత అయింది తను...నోటి వెంట మాట పెగలక అలానే చూస్తూండి పోయింది.

"అలాచూస్తావేం రజనీ....నేను చేసిన దానిలో తప్పేముంది!"

-అతడి బుకాయింపుకు తను రౌద్రమూర్తి అయింది.

"తప్పా, తప్పున్నరా ?... హక్కు పొందకుండా, అనుమతి తీసుకోకుండా ఏ వస్తువునూ తాకే అధికారం ఎవరికీ ఉండదని నీకు తెలియదా నవీన్ ?" అడిగింది.

"ఓ....అదా ! ....నిన్ను నేను తాకవచ్చు. ఏ మైనా చెయ్యొచ్చు....అందువల్ల నీకూ, నాకూ కలిగే నష్టమేంలేదు...మెళ్ళో పసుపుతాడు లేకపోతేనే ఆడదానికి కొన్ని హద్దులూ, అమావాస్య జాగరణలూను...అదుంటే ఆడది ఏం చేసినా చెల్లుబాటైతుంది ఈ సంఘంలో...." ఓ తాగుబోతులా మాట్లాడ సాగాడు.

అతడి ఆ ధోరణికి తనగుండె గుభిల్లుమంది

"అంటే.... ?"

"ఏముంది రజనీ.... ఇది మనిద్దరికీ ఓ చక్కటి అవకాశం.... చేసుకున్న మొగుడంటే నీకు ఎలాగో ఇష్టంలేదు... నేను నీకు అన్ని విధాల నచ్చానన్నావ్.... మరెందుకు సంకోచం ?.... కమాన్ .... రా...." అంటూ చేతులు చాచాడు నవీన్.

అతడి మాటలు తన మనసు పాలిట సమ్మెట దెబ్బలయ్యాయి... అహంకారం పూర్తిగా దెబ్బతినిపోయింది.

"....అయితే ఇంతకాలం నువ్వు వల్లించిన ఆశయాలు, విప్లవాత్మక భావాలు...."

"అవన్నీ ఎదటివాళ్ళను నమ్మించటానికేగాని, నేనుఆచరించటానికి కాదు పూర్ రజనీ.... ఈ లోకంలో సగర్వంగా, సంతోషంగా బ్రతకాలంటే ఎన్నోమాటలు చెప్పాలి. ఎంతోనటించాలి.... ఎన్నో నేర్చుకోవాలి.... నలుగురిలో గుర్తింపులోకి రావాలి.... స్వతః నాకు అబ్బినవిద్య సంగీతం.... అదొక్కటీ తప్ప మిగిలినవన్నీ కృత్రిమాలే.... ఓ సందర్భంలో కళాకారులకు సౌందర్యారాధన ఎక్కువని నువ్వేగా చెప్పింది ?.... నేనూ కళాకారుణ్నే మరి. నాకూ సౌందర్యారాధన ఎక్కువగానే ఉంది.... అందుకే అందమైన నిన్ను చూశాక నా మనసు నీ మీదికి పోయింది.... ఏదో విధంగా నీ అందం నా సొంతం కావాలి. అదే నా తపన.... అడ్డంకులు లేకపోతే నిన్ను పెళ్ళిచేసుకొనేవాణ్ణే. కానీ, లోగడే నీమెళ్ళో మరొకడు తాళి బిగించేశాడు.... అలాంటి నిన్ను నేను తిరిగి పెళ్ళాడటం— ఇది జరిగే పనికాదు. పరువు ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలకు పాకులాడే పెద్దలు మనిద్దరి వివాహాన్ని ససేమిరా ఆమోదించరు. పెద్దలను కాదని నిన్ను పెళ్ళాడి నేను హాయిగా బ్రతకటమనేది అసంభవం.... అన్నీ నాకుతెలుసు... అలా అని అందిన పండువైన నిన్ను అనుభవించకుండా వదిలేయటానికి నాకు మనస్కరించటంలేదు.... ఏవిధంగానైనా— ఈరోజు చిక్కిన సమయాన్ని సద్వినియోగ పర్చుకోవాలనుకున్నాను. అందుకే ప్రత్యేకించి నిన్ను రమ్మన్నది.... నువ్వంటే నాకూ, నేనంటే నీకూ ఇష్టమేగద ?.... అలాంటప్పుడు అనవసర సందేహాలెందుకు?....కమాన్, రజనీ మనిద్దరిమధ్య-ఈ అనుబంధాన్ని బయటికి పొక్కనివ్వను ఎలాంటి సందర్భంలో కూడా...కావాలంటే ప్రమాణంచేస్తాను...."అంటూ తనచేతిలో చేయివేయబోయాడు.

ఆ సమయంలో తనని ఏ మహాశక్తి ఆవరించిందో తెలియదుగాని— స్పృశించబోయిన ఆచేత్తోనే అతడి చెంప ఛెళ్ళుమనిపించి— చర చర— దాదాపు పరుగు తీస్తున్నట్లు నడుస్తూ మేడమెట్లు దిగింది... ఇంటికివెళ్ళి గదిలో ఒంటరిగా పడుకొని వెక్కి వెక్కి ఏడవటం మినహా ఏమీ చేయలేకపోయింది అయినా ఏం చేస్తుంది. తను ఆడది !


ఏమి చదువుకున్నా, ఎంత సంస్కారం నటించినా, ఎన్ని నీతి వచనాలు వల్లెవేసినా— ఈ సంఘం మారదు. ఎవడైనా తన భావాలను ఎదుటివాడి నెత్తిన రుద్ది- వాట్ని శుద్ధిగా ఆచరించ మంటాడే గాని తనుచేసి చూపడు... వ్యవస్థ, ఆడది- ఆమెజీవితం- అన్నీ శాప గ్రస్తంగా మిగిలి పోవలసిందే చివరికి ?

నవీన్... చదువుకున్నవాడు కాబట్టి సంస్కారవంతుడను కున్నది....వ్యక్తీకరించే భావాలను పట్టి - ఈ దేశానికి కాబోయే సంఘ సంస్కర్త ఇతడే కాబోలు! అనుకొంది... అన్ని కళలలోనూ ప్రావీణ్యం ఉంది కాబట్టి మహామేధావిగా ఎంచుకొంది.... అలాంటిది - అవన్నీ తను హాయిగా బ్రతడానికి, అభ్యసిస్తున్న విద్యలని తేల్చి చెప్పేశాడు. ఎంత చదివినా, ఎన్ని విద్యలు నేర్చినా మహామేధావి

అయినా - అతడు సంస్కారహీనుడు. ఏమీ చదవని మామూలి మనిషిలో ఉండే మానవత్వానికి సంబంధించిన నిజాయితీ కూడా అతడిలో లోపించటం - ఘోరాతిఘోరమే.... పోనీ.... ఇక ఆ అవకాశవాదిని, నయవంచకుణ్ణి తలవనేకూడదు.

ఇపుడు ... తన భవిష్యత్తు ఏమిటి?... అసలు మొదట్నుంచీ హేమంత్ అంటే తనకు ఎందుకు తేలికభావం ?.... తెలిసీ తెలియని వయసులో అల్లరిపనులు చేశాడని - జీవితాంతమూ అలాగే ఉంటుందా అతడి ప్రవర్తన.... ఓ విధంగా హేమంత్ తనవల్లె చదువు మానేశాడు... చదువు లేకపోయినా సంస్కారముంది అతడిలో.... అందువల్లే ఏనాడూ తన ఇష్టాన్ని మీరి ప్రవర్తించి ఎరుగడు.... తనంటే ఎంతో మమకారం ఉండబట్టే సంవత్సరాల తరబడీ - తన అంగీకారం కోసమే ఎదురు చూస్తూ కాలం గడుపుతున్నాడు.... మానవత్వం ఉన్న అతణ్ని ద్వేషించటంలో అర్థం లేదేమో ?.... తమకు చిన్నతనంలోనే పెళ్ళి చేయటం పెద్దలతప్పే - తప్పితే హేమంత్ ఏం పాపం చేశాడని అతణ్ని శిక్షించటం?...

...తన మనసు మారిందని తెలిస్తే హేమంత్ ఎంతో సంతోషిస్తాడు. ఎగిరిగంతేసివస్తాడు....అయితే....నవీన్‌తో తన పరిచయము, జరిగిన సంగతులు తెలిస్తే?.... కట్టుకున్నభర్తను వదిలి పరాయి మగవాడితో పరిచయం పెంచుకున్న నువ్వా నాకెందుకు ? అని ఛీత్కరిస్తాడా? లేక....'అదో అనుభవంగా భావించుకో రజనీ.... అసలు అలాంటి సంఘటన ఎదురు కాకపోతే నా విషయమై నీలో ఇంత సులభంగా మార్పు వచ్చేదా? నేనింత ఆనందం అనుభవించ గలిగేవాణ్ణా?... అంటూ హృదయ సంస్కారంతో చేరదీసి - ఆదరిస్తాడా?... లేదు బావ తనని తప్పక ఆదరిస్తాడు. తను ఆలోచిస్తు



న్నట్లే గతాన్ని పీడకలగా మరిచిపొమ్మని సలహా కూడా ఇస్తాడు ....

కానీ.... అదంత సులభంగా జరిగే పనా ?.... గతంలోని దుస్సంఘటనలను, తన దురుసు ప్రవర్తనను అతడంత తేలిగ్గా మరిచిపోతాడా?.... జీవితంలో తనముఖం చూడటానికి ఇష్ట పడడు. గతానుభవం బట్టి తన మార్పును గురించి తండ్రి ఉత్తరం రాసినా - అతడు దాన్ని నమ్మడు. చేసిన నేరానికి శిక్ష అనుభవించవలసిందే...

- అలా దిగులుతో క్రుంగుతూ తిరుగుతూండగానే తను జ్వర పడింది.... జ్వరం తగ్గినా కావాలనే పరీక్షలు రాయలేదు.

తనలో మార్పు అందరికీ హర్షదాయకమైంది.... హేమంత్‌కు ఉత్తరాల మీద ఉత్తరాలు రాయటం మొదలుపెట్టాడు తండ్రి.... తిరుగు సమాధానం మాత్రం రావటం లేదు.

"పోనీ మనమే వెళ్ళి అతడికి అన్ని సంగతులూ చెబితే?" - అంది తల్లి.

"అయినా నమ్మడమ్మా బావ.... మనం వెళ్ళటం అనవసరం. నా అదృష్టం బావుంటే అతడే తనకు తానై వస్తాడు ఇక్కడికి.... అప్పుడే పరిస్థితులనుబట్టి - నన్ను అర్థం చేసుకుంటాడు.... అంతేగాని మీకు మీరై నన్ను తీసుకువెళ్తే - నేను కేవలం మీ బలవంతం మీదే తన దగ్గరికి వచ్చానని అనుమాన పడతాడు ... చివరి మాటగా చెబుతున్నాను. బావంటే నాలో అయిష్టత లేదు......... ఎప్పుడు వచ్చినా కాదనకుండా అతడితో వెళతాను. కానీ, మీరు మాత్రం అనవసరంగా తొందర పడకండి" అంటూ తన మాటగా చెప్పింది ఆలోచించి....తన నిర్ణయాన్ని బలపరిచాడు ప్రసాద్... ఆనాటినుంచీ తను ఎదురు చూస్తున్నట్లు జరగనే లేదు.

మరి.... ఇపుడు.... హేమంత్ శారదను పెళ్ళి చేసుకోబోతున్నట్లు ఉత్తరం రాశాడు ప్రసాద్ ? నిజమే కావచ్చు.... అతడు అలాంటి నిర్ణయానికి రావటంలో తప్పులేదు.... ఎందుకంటే హేమంత్‌ను ఆ స్థితి వరకు తీసుకువచ్చింది తనే.... పోనీ... తనకు నచ్చిన అమ్మాయిని చేసుకొని బావనైనా సుఖపడనీ .. ఏ విధంగా చూసినా 'తగుదునమ్మా' అని వెళ్ళి వాళ్ళిద్దరికీ అడ్డుపడే అధికారం, హక్కు తనకు లేవు... ప్రపంచంలో వేటినైనా పోగొట్టుకోవటం తేలికేగాని - తిరిగి సంపాదించటం అంత సులభం కాదు.

- అలా నిర్ణయానికి వచ్చి ప్రసాద్ రాసిన ఆ ఉత్తరాన్ని తల్లి దండ్రులకు చూపనే లేదు రజని. సంగతి తెలిస్తే వాళ్లు అనవసరంగా ఖంగారు పడతారన్నది ఆమెభయం.

## 15

ఆ వేళ - తెల్లవారుతూండగానే ఎంతో హడావిడిగా కళ్యాణి వాళ్ళ ఇంటికి వచ్చాడు సుందరమూర్తి.

అప్పుడే నిద్ర పక్కమీంచీ లేచిన కళ్యాణి అతడి వాలకం చూసి బిత్తర పోయింది.

"శారదకు చాలా అన్యాయం జరిగిపోయిందండి... రాత్రి వాళ్ళ నాన్నగారు అకస్మాత్తుగా పోయారు"

- అతడి మాటలకు షాక్ తిన్నట్లైంది కళ్యాణి. నోటివెంట మాట పెగలటం కష్టమైపోయింది.

"సోమశేఖరం మామయ్య గుండెజబ్బు మనిషిట... లోగడ కూడా కొన్ని సార్లు వచ్చిందట గుండెనెప్పి...అలాగే రాత్రీ వచ్చింది. డాక్టర్ని తీసుకువచ్చి ఎన్ని ప్రయత్నాలు చేసినా తేరుకోలేకపోయారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఆయన కన్ను మూశారండీ...." అలా చెబుతున్నప్పుడు మూర్తి కంఠం రుద్ధమైంది.

కళ్యాణికి కళ్ళు చెమర్చాయి... "పదండి వెళ్దాం..." అని ఇంటి వెనక బావిదగ్గర ఉన్న తల్లికి విషయం చెప్పిరావటానికి వెళ్ళింది లోపలికి.

• • •

"కళ్యాణీ...." అంటూ గావురుమంది శారద స్నేహితురాలిని చూడగానే.

"ఊరుకో శారదా...ఇలా జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు..." అంది కళ్యాణి మిత్రురాలికంటే తనే ఎక్కువ బాధ పడుతూ.

" నరవంచనకు దైవ వంచన తోడైంది ... ఈ బ్రతుకే ఇక అనవసర మనిపిస్తోంది కళ్యాణీ"

"అలా అధైర్యపడకు శారదా ...నువ్వు నీ ఒక్కదాని గురించీ ఆలోచించుకొనే సమయం కాదిది... మీ అమ్మగారు, తమ్ముడు, చెల్లాయి - వాళ్ళకోసమైనా నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి... చీకటిని చూసి ఈ వేళ ఎంత నిరాశ చెందుతామో - దాని వెనకనే వచ్చే వెలుగురేఖల్ని చూసి రేపు అంత ఆనంద పడతాము... భగవంతుడు నీకు తప్పకుండా మేలు చేస్తాడు శారదా. నాకు ఆ నమ్మకం ఉంది"

- 'నరవంచన' అంటూ ప్రత్యక్షంగా తననే ఎత్తి పొడిచినా చలించకుండా - చేతనైన విధంగా ఓదార్చి ధైర్యం చెప్పింది కళ్యాణి.

"కళ్యాణీ... నన్ను గురించి అన్నీ తెలిసీ-నువ్వింకా అలా ఆశపడుతున్నావంటే - అది నీ పిచ్చితనమేనే... భగవంతుడు నాకు మంచే చేయ దలుచుకుంటే - ఈజీవితం మరో మలుపు తిరిగేది."

- శారద మనసులోని బాధను అర్థం చేసుకోగలిగి-అందుకు కారణ భూతురాలైన తనకు భగవంతుడు ఏదైనా శిక్ష వేస్తే బావుండు నని లోలోపల పరితపించ సాగింది కళ్యాణి.

• • •

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. పగలల్లా ఇంటిచాకిరీ చేసి అలసిపోయిన శ్రీలక్ష్మి అప్పటికే నిద్రలోకి జారుకొంది....కళ్యాణి మాత్రం ఏదో పుస్తకంలో తలదూర్చి ఇంకా మెలకువగానే ఉంది.... మరి ఏ వ్యాపకంలో పడకపోతే శారద - ఆమెను వంచించిన తీరు పదే పదే మెదులుతోంది మనసులో. అందువల్ల నిద్రపట్టటం లేదు.

చదువుతున్న పుస్తకం పూర్తైంది....కళ్ళు బరువెక్కాయి.... నిద్రపోదామని లేచి లైటు తీసివచ్చి పడుకొంది.....

అప్పుడే బయట ఎవరో తలుపుతట్టిన శబ్దం వినిపించి లేచి వెళ్ళి తిరిగి లైటువేసి తలుపు గడితీసింది....

చూస్తే హేమంత్ !

"ఊరునుంచీ ఎప్పుడు వచ్చావన్నయ్యా ?" అడిగింది కళ్యాణి.

"తెల్లవారుఝామునే వచ్చాను...."— హేమంత్ సమాధానం చెబుతున్నప్పుడు గుప్పున వాసన.

"నువ్వు త్రాగుతావు కూడానా అన్నయ్యా ?" అనుమానంగా అడిగింది.

"అదివరకైతే— అకేషనల్‌గా త్రాగేవాణ్ణి.... ఈ వూళ్ళో ప్రసాద్‌గాణ్ణి చూశాక అది ఎక్కువైంది....నా మనశ్శాంతిని పాడు చేశాడు వాడు....వాతావరణంలో మార్పుకోరి టూర్ ప్రోగ్రామ్ వేసుకున్నాను....కలకత్తా, కాశీ, అలహాబాద్, ఢిల్లీ, ఆగ్రా - అజంతా ఎల్లోరా—ఎంత తిరిగాననీ - ఎన్ని చూశాననీ .... అందువల్ల నేను పొందగలిగింది తాత్కాలిక మనశ్శాంతి మాత్రమేనని ఇక్కడికి వచ్చాక తెలిసివచ్చింది...నా జీవితం ఇక ఇంతే కళ్యాణీ.... ఇంతే..." అంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

"....నిన్ను నువ్వు ఇలా శిక్షించుకోవటంలో అర్థం లేదు అన్నయ్యా...." అతడి వైపు జాలిగా చూస్తూ అంది.

"నన్ను నేను శిక్షించుకోవటం లేదు కళ్యాణీ....ఆ భగవంతుడే నన్ను శిక్షిస్తున్నాడు" అంటూ నుదురు కొట్టుకున్నాడు హేమంత్.

కొద్ది సేపటి తర్వాత—" ఈ మధ్య శారదావాళ్ళ నాన్నగారు పోయారన్నయ్యా, పాపం" అంటూ విషయం చెప్పుకొచ్చింది కళ్యాణి.

"అలాగా ! ఎంతపని జరిగిపోయింది కళ్యాణీ.... ?"- మత్తులో ఉన్నా హేమంత్ మనసు కదిలిపోయింది.

"ఏమిటో అన్నయ్యా, శారద పరిస్థితి తలుచుకుంటుంటే నాకు మనసంతా దేవినట్లు అయిపోతోంది....సోమశేఖరంగారికి ఉన్నట్లుండి అంత గుండెనెప్పి రావటానికి కారణం ఏమిటి ?- ఇంతకాలం మనం దాచిన నిజం—అది చివరికి ఆయనకూ తెలిసివుంటుంది. తన కూతురి బ్రతుకు ఇలా మారిందా ? అన్నదిగులు ఆ వ్యక్తిని అహరహం కృంగ దీసి ఉంటుంది. అందుకే ఆయన అలా కన్ను మూశారు...."

—హేమంత్ చైతన్య రహితుడై పోయాడు....అదీగాక అప్పుడతడు దేన్ని గురించీ లోతుగా ఆలోచించేస్థితిలో లేడు.

"....నాకు నిద్రవస్తోంది కళ్యాణీ....ఇంటికి వెళ్దామంటే కారు రిపేరు కొచ్చింది....దాన్ని షెడ్డులోపడేసి రిక్షాలోవచ్చాను...." అన్నాడు-అప్పటికతడి నాలుక లుంగలు తిరుగుతోంది.

"అలాగే అన్నయ్యా...." అతణ్ణి లేవదీసి తన మంచం మీద పడుకోబెట్టి—పక్కనే చాప పరుచుకొని తను తడుకొంది కళ్యాణి.

## 16

"అక్కయ్యా!.... నీకోసం ఆయన వచ్చారు" అంటూ వచ్చి రహస్యంగా చెవిలో చెప్పింది చెల్లెలు ఉమ-ఏదో పుస్తకం చదవటానికి విఫలయత్నం చేస్తూ, దాని మీద మనసు లగ్నం చేయలేక-కిటికీలోంచీ శూన్య ఆకాశంలోకి వెర్రిగా చూస్తూ - ఒంటరిగా గదిలో కూర్చొని ఉంది శారద అప్పుడు.

మొదట అర్థంకాక "ఎవరే ఆయన ?" అని అడిగింది.

"అదేనక్కయ్యా...ఆరోజు.... మనింటికి కారులో రాలా?"

అర్థమైపోయింది శారద.... వెంటనే విసురుగా లేచివెళ్ళి,

"ఓహో, హేమంత్ బాబుగారా !... ఇలా వచ్చారేమండీ...?.... మేమింకా బ్రతికి ఉన్నామో లేదో అని చూసి వెళ్దామని వచ్చారా ?" అనడిగింది- హృదయంలోంచీ తన్నుకొస్తున్న రోషంతో, దాంతో చితైపోయాడు హేమంత్.

"అదికాదు శారదా.... మీనాన్నగారు పోయారని తెలిసింది.... నిన్ననే నేను ఊరునుంచి వచ్చాను.... నీకు అన్యాయం జరిగింది... నీ పరిస్థితి ఇలా మారటానికి- ఒక విధంగా బాధ్యతనాదే" అన్నాడు పరితాపంగా.

మొదట అంత వికటంగా మాట్లాడినా- తర్వాత అతడి నోటి వెంట మరేమైనా ఆశావహమైన మాటలు వస్తాయేమోనని ఎదురు చూసింది శారద.... నిన్ను కోడలిగా చేసుకోవటానికి మా అమ్మగారే కదా ఒప్పుకోనిది ?— నాకుమాత్రం నువ్వంటే ఎంతో ఇష్టం— అదినీకు తెలియదా ?.... నాకు ప్రియాతి ప్రియమైన దానివి కాబట్టి- మా అమ్మగారు అవునన్నా కాదన్నా నిన్నే చేసుకు తీరుతాను. భవిష్యత్తును గురించి నువ్వేం బెంబేలు పడి పోనవసరం లేదు' అంటూ అతడు మాట్లాడితే తన మనసు ఎంత ఊరట చెందుతుందో కద ? అంటూ ఆశపడింది.... కానీ, అలా జరగనేలేదు.

"నాకు అన్యాయం జరిగిన మాట నిజమే అయినా- అందుకు బాధ్యులు ఫలానావారు అని నేను నిందలు మోపదలుచుకోలేదు.... నాకేదో కష్టం కలిగిందని- వచ్చిమీరు నన్నేమో ఓదార్చటంలోనూ అర్థంలేదు.... ఈ లోకంలో తెల్లవారి లేచింది మొదలు ఎందరికి ఎన్ని కష్టాలు రావటంలేదు ?.... వాళ్ళందరి విషయంలో లేనిశ్రద్ధ- నామీదే మీకు కలగటంలో ఏమాత్రం న్యాయంలేదు..." అంది కటువుగా,

"శారదా !"— ఆమె మాటలు హేమంత్ పాలిట శూలాలయ్యాయి.

".... ఏదో ఆపదలో ఉన్న నన్ను చూడటానికి వచ్చారు. చూశారు.... దయచేసి ఇక వెళ్ళండి....నలుగురూ చూస్తే బావుండదు" అనేసింది టక్కున.

"అలాగే శారదా.... ప్రస్తుతానికి ఈ కొద్దిమొత్తం ఉండనీ.... దీని అవసరం మీకిప్పుడు చాలా ఉంది" అంటూ జేబులోంచి ఓరూపాయల పొత్తి తీసి బల్లమీద పెట్టాడు.

"దయచేసి ఆ డబ్బుతీసి తిరిగి మీజేబులో పెట్టుకోండి.... ఒకరి దయా దాక్షిణ్యాలమీద బ్రతికే దుస్థితి ప్రస్తుతానికి మాకులేదు...."

శారద మొండి ప్రవర్తనకు, దురుసు మాటలకు- చివరికి హేమంత్‌లో సహనం చచ్చిపోయింది. ఆమె అలా అనగానే వెంటనే ఆడబ్బును తీసి తిరిగి జేబులో పెట్టేసుకొని " శలవు శారదా.... వస్తాను" అని చరచర బయటికి వచ్చేశాడు. ఆ యింట్లోంచి హేమంత్ వెళ్ళిపోయాక— శారదకు పెల్లుబికి వచ్చింది దుఃఖం.

## 17

"హల్లో, మూర్తీ...." వాళ్ళ ఇంటికి వెళ్ళి మూర్తి కనపడగానే అంది శారద.

తండ్రి హఠాత్తుగా పోయినప్పుడు - కర్మ కాండల భారమంతా తన నెత్తినే వేసుకొని చేశాడు మూర్తి. ఆ తర్వాత కూడా అతడు తరచు తమ యింటికి వచ్చి యోగక్షేమాలు అడిగి తనకు చేతనైన సాయం చేయటానికి ప్రయత్నిస్తూండటంతో - మూర్తి అంటే ఓ విధమైన గౌరవ భావం ఏర్పడసాగింది శారదలో.... అందుకే అప్పుడప్పుడు తనూ వాళ్ళ ఇంటికి వెళ్ళటం అలవాటు చేసుకొంది ఈ మధ్య.

మొదట ఎన్నడూ లేనిది శారద తమ ఇంటి గడప తొక్కటం చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.... తర్వాత ఆమెలో ఏదో మానసికమైన మార్పు వచ్చినట్లనిపించింది అతడికి... అయితే ఆ మార్పును గురించి తెలుసుకొనే ప్రయత్నం మాత్రం చేయలేదు.

ఎందుకంటే హేమంత్‌ను ఏనాడైతే వాళ్ళ ఇంట్లో చూశాడో- ఆనాడే తన మనసును పూర్తిగా మార్చేసుకున్నాడు మూర్తి. శారద తనది కాదు. ఆమె వేరొకర్ని ప్రేమిస్తోంది.... అందని పండుకు అర్రులు చాచటం అవివేకం అని అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేశాడు. అది లగాయితూ శారదను తన కలలరాణిగా ఊహించుకోవటం మానేసి - బంధువుగా, స్నేహితురాలిలా గుర్తించి - గౌరవంగా మసలుకో సాగాడు.... మరి ఈ మధ్య శారద తనపట్ల కనబరుస్తున్న అభిమానం?—అది ఆమె తండ్రిపోయినప్పుడు తను సహాయపడినందుకు కృతజ్ఞత కావచ్చు.

"హలో శారదా....కమాన్...." అన్నాడు మూర్తి ప్రత్యభివాదం చేస్తూ.

"నాకు బ్రతుకు తెరువు దొరికింది మూర్తీ ....నీ స్నేహితుడు ప్రసాద్‌గారి - వాళ్ళ ఆఫీసులో డిస్పాచ్‌క్లర్క్ పోస్టు ఇప్పించారు.... అంతా కళ్యాణి ప్రోద్బలంతో జరిగింది... మధ్యాహ్నమే ఇంటర్వ్యూకు వెళ్ళాను.... ఇంటర్వ్యూ అయిపోయిన కాసేపటికే అప్పాయింట్‌మెంట్ ఆర్డరు కూడా చేతికిచ్చారు...రేపే డ్యూటీలో జాయినవుదామనుకుంటున్నాను...." అంటూ తన మనసులోని మాటలను గడ గడ చెప్పేసింది.

"అలాగా !.... ప్రసాద్ మంచి పనే చేశాడు.... అయితే శారదా, మరి ఈ విషయంలో హేమంత్ పర్మిషన్ తీసుకున్నావా?.... అతడేదో టూర్ వెళ్ళినట్లు చెప్పింది కళ్యాణి ?...." అంటూ సందేహం వ్యక్తం చేశాడు మూర్తి.

"అతడు టూర్‌నుంచీ వచ్చి చాలా రోజులైంది.... ఏదైనా మూర్తీ, ఉద్యోగం నా వ్యక్తిగత విషయం.... ఇందులో ఒకరి అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు...." -ఆ మాటలు అంటున్నప్పుడు శారద కంఠం గట్టిగా ధ్వనించింది.

"అలా అంటే ఎలా శారదా !.... నా ఉద్దేశ్యంలో నువ్వు అతణ్ణి ఓమాట అడిగి ఈ నిర్ణయానికి రావలసింది...."

"నీవు నామంచి కోరి ఇచ్చే సలహాకు థాక్స్‌మూర్తీ —" అంటూ మరేమో చెప్పబోయింది శారద. కానీ అప్పుడే లోపల్నించీ వచ్చిన మూర్తి తల్లి రాజమ్మగార్ని చూసి ఆగిపోయింది.

"ఏమమ్మా శారదా.... ఈ వేళప్పుడు ఏమిటి ఇలా వచ్చావు? అని అడిగింది ఆవిడ. "ఏంలేదత్తయ్యా... నాకు ఉద్యోగమైంది.... ఈమాట మీకు చెప్పి పోదామని వచ్చాను" అంది శారద.

"అలాగా మంచిదమ్మా.... ఒరే మూర్తీ, నేను చెప్పినదేమిటి నువ్వు చేస్తున్నదేమిటి? బజారువెళ్ళి పండ్లు, పూలు, తమలపాకులూ అవీ తీసుకురా.... రేపు ఉదయం ఏడు కొట్టేసరికి అక్కడ ఉండి తీరాలి మనం... సిద్ధాంతి చెప్పిపోయాడు ఇందాక" అంది కొడుకుతో.

శారద అర్థం కానట్లు మూర్తివైపు చూసింది.

"రేపు ఈ ఊళ్లోనే ఓ సంబంధం చూడటానికి వెళ్తున్నాం శారదా....అదీ, అమ్మ...హడావిడి...." అని లేచి మూలనున్న జోళ్ళు తగిలించుకున్నాడు మూర్తి.

"అలాగా!... నేనూ వస్తున్నాను మూర్తీ... వెళ్ళొస్తాను అత్తయ్యా" అని రాజమ్మకు చెప్పి మూర్తితో పాటే బయలుదేరింది, అక్కణ్ణుంచీ.

"తన ఆరోగ్యం బావుండలేదట... నా పెళ్ళి త్వరగా జరగాలట. అమ్మ అలా మనసు పడటమూ సహజమే మరి.... అలాగే నేను పెళ్ళి చేసుకోవటానికి ఎలాంటి ప్రతిబంధకాలూ లేవు.... అమ్మాయి నచ్చితే ఈ సంబంధం ఖాయం చేసుకోవాలని అనుకొంటున్నాను శారదా" - మామూలుగానే చెప్పాడు మూర్తి.

అయితే అతడు తొందరపడి మరో సంబంధం చూడటానికి వెళ్తూండటం వెంటనే పెళ్ళి చేసుకోవాలన్న నిర్ణయానికి రావటం—' "తనమీద కసితీర్చుకోవటానికే ఇలాచేస్తున్నాడేమో మూర్తి ?' అని అనిపించసాగింది శారదకు.

ఇంతకాలం అతడు తన చుట్టూ తిరగటం, తను తిరస్కార భావంతో ప్రవర్తించటం - హేమంత్‌ను ప్రేమించి, అతడి ఆస్తిపాస్తులపై మోజు పడి అనవసరమైన ఆశలు తను పెంచుకోవటం - చివరికి హేమంత్ తనని మోసగించటం - అన్నీ మనసులో పెట్టుకొనే 'నా మీద కూడా నువ్వు ఆశలు పెంచుకొనే అవకాశం లేదు' అని తెలియ చెప్పటం కోసమే ఈ దృఢ నిర్ణయానికి వచ్చాడేమో?.... ఏమో ?.... హేమంత్‌కు, తనకు బెడిసి కొట్టినట్లు మూర్తికి తెలిసినట్లే లేదు మరి?

"మంచిది. అలాగే కానీ మూర్తీ" అంది పై మాటగా.

## 18

ఆవేళ ఆఫీసునుంచీ ఇంటికి వచ్చిన ప్రసాద్‌కు ఏమీ తోచక - తన ఉత్తరానికి సమాధానంగా రజని కొద్ది రోజుల క్రితం వ్రాసిన ఉత్తరాన్ని తీసుకొని - మరో మారు చదివాడు. 'బావ ఇష్టాన్ని కాదనే అధికారం నాకులేదు.... అతడి జీవితానికి నేను అడ్డువచ్చే సమస్య ఏనాడూ ఉత్పన్నం కాదు, కాకూడదు.... అవకాశముంటే నూతన దంపతులు కాబోతున్న హేమంత్, శారదలకు నా శుభాకాంక్షలు తెలుపు" - ఇదీ అందులోని సారాంశం.

రజనిలో మార్పు వచ్చినమాట నిజం. అది తనకు తెలుసు.... ఎంత ప్రయత్నించినా తన మాటను నమ్మటం లేదు హేమంత్.... రామచంద్రరావు మామయ్య పని కట్టుకొని వచ్చి - ఏ విధంగానూ ఒప్పించ లేకపోయాడు అతణ్ణి.... బావపై నాకు గల హక్కు, అధికారాలనుకోల్పోయాను. అతడి ముందుకు ధైర్యం చేసి రాలేను. అయినా గతానుభవాన్ని బట్టి అతడు నన్ను క్షమించి - చేరదీసే అవకాశం లేదు' అని మొండికేస్తోంది రజని.... రజని అంటే లోలోపల ఇష్టమున్నా—గతంలో ఆమె ప్రవర్తనా సరళిని బట్టి— 'ఆమెలోతనపట్ల జీవితంరో మార్పురాదు ... అటువంటప్పుడు తమ మధ్య పొసగటమూ అసంభవమే... పునర్వివాహం చేసుకొంటేనే తప్పితే తన జీవితం తాపీగా గడవటం కష్టం ... రామచంద్రరావు మామయ్య మాటలు వట్టిబోగస్. నమ్మటానికి వీల్లేదు... రజనిలో పరిమార్పును తను నమ్మలేడు.... అదీగాక ఆనాడు అంత పరాభవం పొందాక తిరిగి ఆయింట్లో కాలుపెట్టటమే ?' అని భీష్మించుకు కూర్చుంటున్నాడు హేమంత్— వాళ్ళిద్దరూ ఒకరిని ఒకరు తెలుసుకొనేది ఎలా ?—ఈ చిక్కు సమస్య విడిపోయేది ఎలా ?

—అలా ఆలోచిస్తున్నాడు ప్రసాద్- ఆ ఉత్తరం అందుకున్నప్పట్నుంచీ కూడా... వచ్చిన రోజునే దాన్ని కల్యాణికి కూడా చూపించాడు. ఆ ఉత్తరం చూసిన ఆమెకు రజని అంటే మొదటిసారిగా సానుభూతి ఏర్పడటం గమనించాడు.—

"మొదట మనం చేయవలసిన పని అన్నయ్యాను, రజనిని ఒక దగ్గిర చేర్చటం. ఆ ఒక్క కలయికే వాళ్ళ భవిష్యత్తును తేల్చివేస్తుంది" అంది కల్యాణి.

"ఎలా ?"

"మార్గం ఆలోచించాలి ప్రసాద్‌గారూ..."—ఏదైనా ప్లానును గురించి ఆలోచించమని సలహాయిచ్చింది. తనూ ఆలోచిస్తానని చెప్పింది కళ్యాణి.

...కానీ, తను ఎంత ఆలోచించినా ఎలాంటి మార్గం కనిపించటం లేదు. మరి కళ్యాణి ఏమాలోచిస్తోందో—ఇంత వరకు బయట పడలేదు....

ప్రసాద్ ఒంటరిగా-ఏమాలోచించటానికీ తోచక సతమతమవు తున్న సమయంలోనే - "నేనొకటి ఆలోచించాను... ఆ ప్రకారమే నడుచుకోవాలనుకుంటున్నాను" అంటూ తన ప్లాను చెప్పుకొచ్చింది, కళ్యాణి అక్కడికి వచ్చీరావటంతోనే.

"సాధ్యపడుతుంది అనుకొంటే నీ మాట ప్రకారమే జరగనీ" అంటూ—అప్పటికప్పుడు తన ఆమోదాన్ని తెలిపేశాడు ప్రసాద్.

ఈ మధ్య కళ్యాణి తరచూ ప్రసాద్ ఇంటికివస్తోంది.... ప్రసాద్ కూడా అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికివెళ్తూనే ఉన్నాడు.... ఇద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవభావం, నమ్మకం కలిగి చాలా కాల మైంది....అలాగే చొరవకూడా ఎక్కువైంది ఇప్పుడు....ఒకరిని ఒకరు చూసుకుంటూ కబుర్లు చెప్పుకోవటం మొదలుపెట్టారంటే గంట లకు గంటలే గడిచిపోతయ్....రెండురోజులపాటు ఒక దగ్గిర కలుసు కోకపోతే వాళ్ళిద్దరికీ ఏదో వెలితి అనిపిస్తుంది....ప్రేమంటే ఇదే నేమో ? అనిపిస్తూంటుంది ఆయిద్దరికీ కొన్ని సందర్భాల్లో.

ప్రసాద్ కళ్యాణి....మాట్లాడు కొనే సమయంలోనే అనుకో కుండా మూర్తి వచ్చాడు అక్కడికి.

"మీ ఒంటరితనాన్ని భంగపరిచినందుకు క్షంతవ్యుణ్ణి" అంటూ వెళ్ళి ప్రసాద్ ప్రక్కన కూర్చున్నాడు మూర్తి.

అతడలా అనేసరికి సిగ్గనిపించింది కళ్యాణికి...ప్రసాద్ అతడి మాటలను ఏ మాత్రం ఖండించలేదు.

"ఏమిట్రా బాయ్, విశేషాలు ?" అని అడిగాడు.

"విశేషమేరా .... విశేషమంటే చాల పెద్దవిశేషం—నా మేరేజ్ సెటిలైంది... ఈ రోజే ముహూర్తాలు పెట్టుకున్నాం..."అంటూ అసలు విషయం చెప్పుకొచ్చాడు మూర్తి.

"అలాగా!.... కంగ్రాక్యులేషన్స్ మూర్తి" అని పైకి అన్నా లోలోపల బాధ అనిపించింది ప్రసాద్‌కు.

ఎందుకంటే శారద ఎంతో ఇష్టమని - ఆమెనే పెళ్ళి చేసు కోవాలని ఉందని లోగడచెప్పాడు మూర్తి... అయితే ఆమె హేమంత్ పట్ల చూపే మోజును చూసి తన నిర్ణయాన్ని మార్చుకొని ఉంటాడు... నిజానికి హేమంత్ వివాహితుడని, శారదకు అతడికి తిరిగి వివాహం జరిగే అవకాశం లేదనీ—శారద, మూర్తి ఇద్దరికీ తెలియదు....అసలు విషయం తెలిసిన మరుక్షణం వాళ్ళ గతనిర్ణయాలు పూర్తిగా మారి పోయే అవకాశం ఉంది.... కానీ, యదార్థం తెలియ చెప్పకుండా తామే తాత్సారం చేస్తున్నారు... పెళ్ళి, ముహూర్తం దాకా వచ్చాక – ఇక మూర్తికి నిజంతెలిసీ ప్రయోజనం లేదు... పాపం శారదకే అన్యాయం జరిగిపోతోంది' అన్నదే అతడి బాధ. కళ్యాణి మనసూ దాదాపు అదే అవస్థలో ఉంది... వివాహం చేసుకోబోతున్న మూర్తిని ఆమెకూడా అభినందించింది తప్పనట్లే.

"సాంప్రదాయమైన కుటుంబం... నా కంటే కూడా మా అమ్మకు ఎక్కువ నచ్చింది ఆ అమ్మాయి... పెద్దది. ఆవిడ ఆనందం కంటే నాకు మాత్రం కావలసిందేముంది? ... ఏదైన ప్రసాద్ ... నేను అనుకున్నట్లు మాత్రం జరగలేదు.... అయినా అనుకున్నది అనుకున్నట్లే జరిగితే జీవితానికి థ్రిల్ ఏముందిరా ?... నా కంటే ముందు శారద వివాహం జరిగిపోతేనే బాగుండేది" అంటూ తన మనసును బయటపెట్టాడు మూర్తి.

దాన్నిబట్టి—శారద మీద అతడిలోని ఆశ ఇంకా చావలేదని అర్థమైంది... కానీ. . చేయిదాటిపోయింది—లోలోపల మధన పడటం మినహా మరేం చేయలేని నిస్సహాయస్థితిలో పడిపోయారు ప్రసాద్, కళ్యాణిలు.

(ఇంకా వుంది)

## ఎర్రతామరలు

### "సుహాసిని"

ఉషోదయంలో
ఎర్రటి హాసరేఖల్తో
భాసిల్లే ఎర్రతామరలు

జనతరాల్లో క్రాంతిని
కోరుతూ
ప్రకృతి ఎగరేస్తున్న
సమర పతాకాలు